క్లుప్తంగా

ఆక్రమిత స్థలం స్వాధీనానికి నోటీసు



నోటీసు అంటిస్తున్న ఈఓ సీతారాంరెడ్డి

కర్నూలు కల్చరల్: కర్నూలు మండలం జొహరాపురం గ్రామంలోని నీలకంఠేశ్వరస్వామి దేవాలయానికి చెందిన భూమిలో 7.72 ఎకరాలను ఆక్రమించుకుని గుడిసెలు వేసుకున్న వారిని ఖాళీ చేయాలని ఆలయ ఈఓ సీతారామిరెడ్డి శనివారం నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవదాయ శాఖ నిబంధనల ప్రకారం 2023 ఫిబ్రవరి 22వ తేదీన సదరు భూమిని బహిరంగ వేలంలో మూడు సంవత్సరాలు కౌలుకు ఇచ్చామన్నారు. అయితే కౌలుదారులు ఈ భూమిలోకి వెళ్లే సమయానికి కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారన్నారు. తర్వాత వారు ఆ స్థలాన్ని వదలకపోవడంతో నోటీసులు ఇచ్చామన్నారు. స్పందించకపోతే తాత్కాలిక గుడిసెలను (తడకలు) తొలగించి దేవాలయ భూమిని స్వాధీనం చేసుకుంటామన్నారు.

కార్పొరేషన్‌లో ఇరువురికి పదోన్నతులు



మేనేజర్‌గా చిన్నరాముడుకు పదోన్నతుల ఉత్తర్వు అందజేస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : నగరపాలకలో ఇరువురికి పదోన్నతులు లభించాయి. దీర్ఘకాలికంగా సూపరింటెండెంట్లుగా పనిచేస్తున్న వారికి ప్రభుత్వం పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో కర్నూలు నగరపాలక మేనేజర్‌గా రెగ్యులర్ పోస్టు చాలా ఏళ్లుగా ఖాళీగా ఉంది. 2018 సంవత్సరంలో అప్పటి మేనేజర్ సుబ్రమణ్యం అనారోగ్య కారణాలతో వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో సీనియారిటీ ప్రాతిపదికన మేనేజర్‌గా చిన్నరాముడును, రెవెన్యూ అధికారిగా జునీద్‌కు పదోన్నతులు వచ్చాయి. శనివారం నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ వారిరువురుకి అందుకు సంబంధించిన ఉత్తర్వులు అందజేశారు.

వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం పరిశీలన



పిల్లలకు సిరప్‌లు అందజేస్తున్న డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని ఇల్లూరు నగర్ యూపీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని శనివారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భవతులు, ఐదేళ్లలోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పకుండా ఇవ్వాలని, ఆ వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. అనంతరం ఆయన పిల్లలకు ఐఎఫ్‌ఏ, విటమిన్-ఎ సిరప్‌లను పంపిణీ చేశారు. ఆయన వెంట వైద్యాధికారి డాక్టర్ సౌమ్య, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

జేఎన్‌టీయూ పాలకమండలిలో జిల్లావాసికి చోటు



జీవీఎం మోహన్‌కుమార్‌ను అభినందిస్తున్న దృశ్యం

కర్నూలు(సిటీ): జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ) అనంతపురం నూతన పాలకమండలిలో జిల్లాకు చెందిన రవీంద్ర విద్యాసంస్థల చైర్మన్ జి.వి.ఎం. మోహన్‌కుమార్‌కు చోటు లభించింది. ఈ మేరకు శనివారం ఆ విద్యాసంస్థలకు చెందిన కాలేజీలో రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య, ప్రిన్సిపల్స్ డాక్టర్ సి.శ్రీనివాసరావు, డాక్టర్ కె.ఇ.శ్రీనివాసమూర్తి అభినందించారు.జేఎన్‌టీయూ అనంతపురం నూతన పాలకమండలిలో ఆరుగురు సభ్యుల ను నియమించారు. ఇందులో తమ విద్యాసంస్థలకు చెందిన చైర్మన్‌ను పాలకమండలి సభ్యులుగా నియమించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.అభినందన కార్యక్రమంలో జి.పుల్ల య్య కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ మమతా మోహన్, రిడ్జ్ స్కూల్ సీఈఓ గోపీ నాథ్, రవీంద్ర విద్యాసంస్థల వైస్ చైర్మన్ జి. వంశీధర్, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ పాండురంగయ్య, వివిధ విభాగాధిపతులు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆర్‌యూ వీసీ ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు, రెక్టార్ సీవీ కృష్ణారెడ్డి



వైఎస్ఆర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సీహెచ్ శిరోమణి మద్దయ్య దంపతులు



వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్‌రెడ్డి

వైఎస్ఆర్ అడుగుజాడల్లో నడుద్దాం

కర్నూలు (న్యూటౌన్): పేదల ఆశాజ్యోతి అయిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అడుగుజాడల్లో నడుద్దామని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం స్టాంటన్ పురంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జోహార్ వైఎస్సార్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

పేదల గుండె చప్పుడు వైఎస్ఆర్

- వైఎస్ఆర్ వర్ధంతి కార్యక్రమంలో జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు
- మహానేత విగ్రహాలు, చిత్రపటాలకు పలువురు నివాళి



మేయర్ క్యాంప్ కార్యాలయంలో నూతన పింఛన్లు అందుకున్న లబ్ధిదారులతో పార్టీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు బీవై రామయ్య, కాటసాని రాంభూపాల్‌రెడ్డి



స్టాంటన్‌పురంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు

కర్నూలు(సెంట్రల్/అగ్రికల్చర్/సిటీ/ న్యూసిటీ): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల గుండెచప్పుడు అని వక్తలు కొనియాడారు. శనివారం వైఎస్ఆర్ వర్ధంతిని పురస్కరించుకుని కర్నూలునగరంలో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోహార్ వైఎస్ఆర్ అని నినదించారు. ముస్లింలు మైనార్టీలు మెచ్చిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి అని, ఆయన ముస్లింలకు ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్లతో ఎంతోమంది పేదలు లాయర్లు, డాక్టర్లు, ఇంజినీర్లు అయ్యారని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. ఎస్‌బీఐ సర్కిల్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అంతకముందు నాయకులు, కార్యకర్తలతో కలసి పాలాభిషేకం చేశారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించిన ఘనత వైఎస్ఆర్‌క దక్కుతుందని చెప్పారు.

మేయర్‌తోపాటు పలువురు నేతల నివాళి...

వైఎస్ఆర్ 14వ వర్ధంతి సందర్భంగా మేయర్ బీవై రామయ్య, డిప్యూటీ మేయర్ నాయకల్లు అరుణతో పాటు మాజీ ఎంపీ బుట్టారేణుక, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాజావిష్ణువర్ధన్‌రెడ్డి, తెర్నేకల్ సురేందర్‌రెడ్డితోపాటు పలువురు కార్పొరేటర్లు వైఎస్ఆర్ విగ్రహానికి ఘన నివాళి అర్పించారు. పూలమాలలు వేసి పాలాభిషేకాలు, జలాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, నాగరాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

☛ జన హృదయ నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

☛ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల హృదయాల్లో ఎప్పటికి పదిలంగా ఉంటాయని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్ పర్సన్ సీహెచ్ శిరోమణి మద్దయ్య తెలిపారు. స్థానిక డీసీఎంఎస్ కార్యాలయంలో వైఎస్ఆర్ చిత్రపటానికి ఆమె నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ రాజేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో..

☛ కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఇందిరాశాంతి పూలమాల వేసి నివాళులర్పించారు. కాలేజీ అధ్యాపకులు డాక్టర్ డేనియల్, డాక్టర్ శారద, డాక్టర్ గిరిజారాణి, డాక్టర్ జి.మహబున్ బాషా, డాక్టర్ ఎస్.మహబూబ్ బాషా, శ్రీమణికంఠ తదితరులు పాల్గొన్నారు.

☛ దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి గొప్ప దార్శనికుడని రాయలసీమ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. యూనివర్సిటీ అధికారులు వైఎస్సార్ 14వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ సీవీ.కృష్ణారెడ్డి, ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ హరిప్రసాద్ రెడ్డి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

☛ మార్గదర్శకులు డాక్టర్ వైఎస్సార్

కల్లూరు: ప్రజారంజక పాలన అందించిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎందరికో మార్గదర్శకులు అని వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ శరీన్‌నగర్, మేయర్ బీవై రామయ్య క్యాంపు కార్యాలయంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే కాటసాని శరీన్‌నగర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మేయర్ క్యాంపు కా ర్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారు కొత్తగా పింఛన్ మంజూరైన లబ్ధిదారులకు పింఛన్ కానుక అందజేసి మాట్లాడారు. సంక్షేమ పథకాల ప్రదాత వైఎస్ఆర్ అని కొనియడారు. అన్ని వర్గాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. విద్యార్థులు విద్యాభివృద్ధికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లుసుదర్శన్‌రెడ్డి, శ్వేతారెడ్డి, అరుణ, చిట్టెమ్మ, శ్రీనివాసులు, లక్ష్మీకాంతరెడ్డి, లక్ష్మీరెడ్డి, నారాయణరెడ్డి, కల్లూరు జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతురెడ్డి, హేమలత, సుంకన్న, ఆయా వార్డులోని స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దేశం బలోపేతమే ప్రధాని మోదీ లక్ష్యం

కర్నూలు (న్యూటౌన్): భారతదేశం బలోపేతంగా ఉండాలన్నదే ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యమని మాజీ రాజ్యసభ సభ్యులు, బీజేపీ నేత టీజీ వెంకటేష్ అన్నారు. శనివారం కర్నూలు మండలం గార్గేయపురంలో నా మట్టి.. నా దేశం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి మట్టిని సేకరించారు. అనంతరం వెంకాయపల్లె ఎల్లమ్మ దేవస్థానంలో ఎల్లమ్మతల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రూ.5లక్షలతో నిర్మించిన టీజీవీ మినిరల్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, బీజేపీ కోడుమూరు ఇన్‌చార్జ్ మీసాల ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వేంకటేశ్వర స్వామి వ్రతం




వ్రతంలో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో శ్రావణ మాసం శనివారాన్ని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. శ్రీ వేంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో తాళ్ల పాక అన్నమయ్య 12 తరం వారసులు శ్రీమాన్ హరినారాయణాచార్యులు (తాళ్లపాక స్వామిజీ) వారి చేతుల మీదుగా గోపూజ, అభిషేకం, హోమం, వేంకటేశ్వర స్వామి వ్రతం నిర్వహించారు. కర్నూలు మాజీ ఎంపీ బుట్టారేణుక, ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఖానా-ఖజానాలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

కర్నూలు (టౌన్) : స్థానిక బిర్లాగేట్ సమీపంలోని ఖానా-ఖజానాలో స్టాల్స్ నిర్వాహకులు, వ్యాపారులు నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం స్థానిక ఖానా-ఖజానా ప్రాంగణంలో వ్యాపారులతో కమిషనర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పెద్ద పెద్ద నగరాల్లో ఈట్‌స్ట్రీట్, ఖానా-ఖజానాలకు మంచి స్పందన ఉందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షాకీర్ హుస్సేన్, రెవెన్యూ అధికారి జునీద్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులు వేగవంతం చేయండి




స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): నగరంలోని 19 వ వార్డు జొహరాపురం రోడ్డులో చేపడుతున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. శనివారం స్థానికంగా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించారు. వివరాలను అసిస్టెంట్ ఇంజినీర్ జనార్దన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రూ. 1 కోటితో చేపడుతున్న టెన్నిస్ సింథటిక్ కోర్టు, క్రికెట్ అకాడమీ నెట్స్, వాకింగ్ ట్రాక్‌తో పాటు చుట్టు కాంపౌండ్ పనులు ఆలస్యంగా జరుగుతున్నాయన్నారు. మూడు వారాల వ్యవధిలో ఈపనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు.

- నగరంలోని స్థానిక గాయత్రీ ఎస్టేట్ పార్కు, ఎండోమెంట్ కాలనీలోని పార్కుల అభివృద్ధి పనులను ఈ నెలాఖరులోపు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. శనివారం స్థానిక 25 వ వార్డు పరిధిలోని పార్కులో జరుగుతున్న పనులను కమిషనర్ పరిశీలించారు. కార్యక్రమంలో నగరపాలక ఇంజినీరింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షాకీర్ హుస్సేన్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజశేఖర్, అసిస్టెంట్ ఇంజనీర్ భాను ప్రతాప్, హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

నేడు కర్నూలులో ఆల్ జమాత్

- హాజరుకానున్న ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు చైర్మన్ ఖాలిద్ సైఫుల్లా రహమాని
- మునిసిపల్ హైస్కూలు గ్రౌండ్‌లో రాత్రి 7:30 గంటలకు బహిరంగసభ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కౌల్ జమాత్ కమిటీ

కర్నూలు(సెంట్రల్) : మారుతున్న దేశ స్థితిగతులు..మన బాధ్యత అనే అంశంపై ఆదివారం కర్నూలులో ఆల్ జమాత్ కార్యక్రమం నిర్వహించేందుకు కౌల్ జమాతి కమిటీ ఏర్పాట్లు చేసింది. పాత కంట్రోల్ రూం సమీపంలోని మునిసిపల్ హైస్కూలులో నిర్వహించే ఆల్ జమాత్ సభకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్‌తో పాటు జుబేర్ మౌలానా, జాకీర్ మౌలానా, హఫీజ్ అబ్దుల్లా, అబ్దుల్ రహమాన్, నూరుల్లా ఖాద్రి, ఖాజీ తౌసిఫ్, హఫీజ్ అబ్దుల్లా ఖుద్దూస్ సభా ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. సభకు కావాల్సిన అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తున్నారు. మరోవైపు సభకు ఎక్కువ మంది ముస్లిం మైనార్టీలు హాజరయ్యేలా మత పెద్దలతో తరచూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. కాగా, ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు చైర్మన్ ఖాలిద్ సైఫుల్లా రహమాని, ఉత్తరప్రదేశ్‌కు చెందిన హజరత్ యాసిన్ ఉస్మాని, బెంగళూరుకు చెందిన హజరత్ ముస్తఫా రిఫాయి, హజరత్ ఇమ్రాన్ మసూద్, హైదరాబాద్‌కు చెందిన బీఆర్ సీరజ్ హాజరవుతున్నారు. ఆదివారం రాత్రి 7:30 గంటలకు ఈ బహిరంగ సభ ప్రారంభమవుతుంది.

సందడి చేసిన సినీ హీరోయిన్ రెజీనా



కర్నూలు(టౌన్): నగరంలోని అబ్దుల్లాఖాన్ ఎస్టేట్‌లో ఏర్పాటు చేసిన వస్త్ర మహల్ దుకాణం శనివారం ప్రారంభమైంది. సినీ హీరోయిన్ రెజీనా కసాండ్రా, కొరియో గ్రాఫర్ శేఖర్ మాస్టర్ కుమార్తె సాహితీ సందడి చేశారు. నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, హఫీజ్‌ఖాన్‌లతో కలిసి హీరోయిన్ రెజీనా షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన, పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ రోజు

సాహిత్యం-హృదయంపై సదస్సు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీన సాయంత్రం 6 గంటలకు 'సాహిత్యం-హృదయం'అనే అంశంపై సద స్సు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వికాస భారతి సభ్యుల సమావేశం

కర్నూలు కల్చరల్: వికాస భారతి సభ్యుల సమావేశం ఆదివారం సాయంత్రం 5 గంటలకు బుధవార పేట కేశవ మెమోరియల్ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సమన్వయకర్త శివప్రసాద్ తెలిపారు.

ఆదిత్య ఎల్-1 విజయవంతం కావాలి

కర్నూలు(సిటీ) : ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయోగించిన ఆదిత్య ఎల్-1 విజయవంతం కావాలని కేవీఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి ఆకాంక్షించారు. శనివారం ఆ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఇటీవలే చంద్రుడిపై చంద్రయాన్-3ని ప్రవేశపెట్టి ప్రపంచంలో ఎవరికీ సాధ్యం కానటువంటి విజయాన్ని భారత్ అందుకుందన్నారు. అదే విధంగా సూర్యుడి ప్రొటో, క్రియోస్పియర్ అధ్యయనం కోసం ఇస్రో ప్రయోగించిన ఆదిత్య ఎల్-1 కూడా విజయవంతం కావాలన్నారు. కార్యక్రమంలో కాలేజీ భౌతిక శాస్త్రం అధ్యాపకులు డాక్టర్ శారద, డాక్టర్ వాసవి, సి.మహబూబ్ బాషా, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కావ్యకు గోల్డ్‌మెడల్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలుకు చెందిన డాక్టర్ గద్ద కావ్యకు ఎంబీబీఎస్‌లో గోల్డ్ మెడల్ లభించింది. స్థానిక మాధవీనగర్‌కు చెందిన గద్ద విజయభాస్కర్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఇటీవల మరణించారు. ఆయన భార్య గద్ద వినీల గృహిణిగా ఉన్నారు. వీరి కూతురు డాక్టర్ కావ్య కడపలోని రిమ్స్‌లో ఎంబీబీఎస్ చదువుతోంది. ఫైనలియర్ పరీక్షల్లో పీడియాట్రిక్స్ విభాగంలో ఆమె గోల్డ్ మెడల్ సాధించింది. ఈ మెడల్ సాధించడం పట్ల తనకెంతో గర్వంగా ఉందని, ప్రోత్సహించిన ప్రొఫెసర్లు, వైద్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆమె పేర్కొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పెన్షన్లు

- కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్
- నూతన పెన్షన్ దారులకు నగదు అందజేత



వృద్ధులకు పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(సెంట్రల్): అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ వర్గాల ప్రజలకు పెన్షన్లు మంజూరు చేస్తున్నారని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. శనివారం ఆయన తన కార్యాలయంలో నూతన పెన్షన్‌దారులకు నగదు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎవరైనా చనిపోతేనే కొత్తగా పెన్షన్ ఇచ్చేవారన్నారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదని అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతుందన్నారు.

సచివాలయ సిబ్బందికి సన్మానం..

వార్డు సచివాలయాలు 116,117,118లలో పనిచేసే సిబ్బందిని ఎమ్మెల్యే తన కార్యాలయంలో సన్మానించారు. అర్హులందరికీ పెన్షన్లను మంజూరు చేయించడంలో కీలకంగా వ్యవహరించిన అధికారులకు ఆయన శాలువ కప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో 45వ వార్డు నాయకులు ప్రభుదాస్, సితార, ఇర్ఫాన్, జమ్మన్న, షైక్, ఖాదర, ఖుద్దుస్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

7న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

కర్నూలు కల్చరల్: సాయిబాబా భక్త మండలి ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ దక్షిణ షిరిడి సాయిబాబా దేవస్థానంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు మండలి కార్యదర్శి మహాబలేష్ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు చిన్నపిల్లలకు శ్రీకృష్ణుని వేషధారణ, రాత్రి 7 గంటలకు ఉట్టికొట్టే కార్యక్రమం పల్లకీ సేవ, రథోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

వొకేషనల్ కాలేజీలో అవగాహన కార్యక్రమం

కర్నూలు సిటీ: ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజీలో ఎఫెక్టివ్ డిసీసన్ మేకింగ్‌పై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బెంగళూరుకి చెందిన మనో విజ్ఞాన నిపుణురాలు శ్రీసాయి సింధుజ శ్రీరామ్ పాల్గొని ప్రసంగించారు. చదువుకునే సమయంలో వచ్చే సమస్యలను ఎదుర్కొవాలంటే ఆత్మ విశ్వాసం అనేది చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఆ కాలేజీ ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌ట్యాంక్‌ను పరిశీలించిన టీడీపీ నాయకులు

కర్నూలు (న్యూసిటీ): మునగాలపాడు సమీపంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను శనివారం టీడీపీ నాయకులు సందర్శించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల ముందు చూపు లేకపోవడంతో నగరంలో తాగునీటి సమస్య ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు బీటీ.నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కోడుమూరు ఇన్‌చార్జ్ ఆకెపోగు ప్రభాకర్ పాల్గొన్నారు.

సదుపాయాలు కల్పించాలని వినతి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని అమీర్ హైదర్‌ఖాన్ నగర్‌లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ డిమాండ్‌చేశారు. శనివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో 48వ వార్డు పరిధిలోకి వచ్చే సచివాలయ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

చెత్త పన్ను రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్) : ట్రూ అప్ చార్జీలు, చెత్త పన్ను రద్దుచేయాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు అబ్దుల్ దేశాయ్ డిమాండ్‌చేశారు. శనివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో పాతబస్తీలోని ఓ సచివాలయం ఎదుట ఆందోళన చేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఉర్దూ వర్సిటీ పాలక మండలి సభ్యుడిగా ఇబ్రహీం

కర్నూలు (న్యూసిటీ) : డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యుడిగా స్థానిక పాతబస్తీ సిరాక్ పాఠశాల అధినేత జీఎండీ ఇబ్రహీంను ఉన్నతవిద్యా శాఖ శుక్రవారం నియమించింది. ఈ సందర్భంగా ఆ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది శనివారం జీఎండీ ఇబ్రహీంను ఘనంగా సత్కరించారు.

మణిపూర్‌కు నిత్యావసరాల తరలింపు

కర్నూలు (టౌన్): మణిపూర్‌లో నిరాశ్రయులైన క్రైస్తవులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నట్లు గిప్సన్ సెంట్రల్ బాప్టిస్టు చర్చి పాస్టర్ కృపాదానం వెల్లడించారు. శనివారం స్థానిక ఆ చర్చి ప్రాంగణం నుంచి నిత్యవసరాలైన శానిటరీ ప్యాడ్స్, దుప్పట్లు, బిస్కెట్లు, చాక్‌లెట్లు, బట్టలు, పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు తదితరవి మినీ వ్యాన్‌లో తరలించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు వినోద్ జోషి, దేవప్రసాద్, దిలీప్, భాస్కర్, సునీల్ పాల్గొన్నారు.

అన్ని వార్డులు అభివృద్ధి చేస్తాం



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య

కల్లూరు: కర్నూలు నగరంలో అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మేయర్ బీవై రామయ్య అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 29వ వార్డుల్లో రూ. 50 లక్షలతో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మేయర్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. కల్లూరు అర్బన్ రోజురోజుకు విస్తరిస్తుండటంతో ప్రాధాన్యాతలను అనుసరించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, డీఈఈ గోపాల కృష్ణ, ఏఈ భాను ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, SHAIK ABDUL SAMAD H.No. 41/590-6, Kothapeta, Kurnool Dist., A.P. Have Changed my name from SHAIK ABDUS SAMAD (Old Name) to SHAIK ABDUL SAMAD (NEW NAME) Hence after all my Documents and Correspondence will continue with my new name SHAIK ABDUL SAMAD.